క్లుప్తంగా

దివ్యాంగుల వివాహానికి ప్రోత్సాహకంపై హర్షం



కామారెడ్డి టౌన్: దివ్యాంగుల వివాహానికి ప్రోత్సాహకంపై మంజూరు చేయడంపై విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్ప దుర్గాప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంగ ఈశ్వర్, నితీష్ రెడ్డి, రంగ్యానాయక్‌లు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



మాచారెడ్డి : మండలంలోని సోమారంపేట గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నౌసీలాల్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న సీఎం ప్రజల పక్షపాతి అని కొనియాడారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రతి గ్రామంలో భూమిపూజ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్‌నాయక్, రాజునాయక్, నారాగౌడ్, లక్ష్మన్‌నాయక్ ఉన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: వివిధ పంటల సాగు పద్ధతులపై శాస్త్రవేత్తల సలహాలను తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పవన్ కుమార్ రైతులకు సూచించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో యూనివర్సిటీ శాస్త్రవేత్తలతో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు రైతులకు పంటల మార్పిడి, ఎరువుల వాడకం , వివిధ పంటల సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ అపర్ణ, ఏఈవో తేజస్విని, శాస్త్రవేత్తలు నవీన్, రేవంత్, హార్టికల్చర్ ఆఫీసర్ సంతోషి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్, సుగుణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్గొండ పీఏసీఎస్ పరిధిలో కొనుగోళ్లు పూర్తి



రాజంపేట : మండలంలోని ఆర్గొండ పీఏసీఎస్ ఆధ్వర్యంలో వందశాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు సింగిల్ విండ్ చైర్మన్ కంది శివరాములు తెలిపారు. ఆర్గొండ పరిధిలోని మొత్తం ఐదు పీపీసీ సెంటర్లలో 1203 రైతుల వద్ద నుండి 1,07,397 బస్తాలు కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. సొసైటీ పరిధిలో 42,958 క్వింటాళ్ల కొనుగోళ్లు జరగగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు ప్రక్రియ సైతం పూర్తి అయిందని తెలిపారు.అందరి రైతుల ఖాతాలో మొత్తం రూ. 9 కోట్ల 96 లక్షల పై చిలుకు నగదు జమకానున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికూ చాలా మంది రైతుల ఖాతాలో నగదు సైతం జమ అయిన ట్లు ఆయన తెలిపారు. కొనుగోళ్లకు సహకరించిన రైతులు, సిబ్బంది, హమాలీలను ఆమన అభినందించారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి



బీబీపేట: రైతులందరు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని ఏఈవో సంతోష్ తెలిపారు. గురువారం మండలంలోని యాడారం గ్రామంలోని రైతు వేదికలో రైతుల వివరాలను నమోదు చేశారు. యాడారం క్లస్టర్ పరిధిలో ఉన్న రైతులు పాసుబుక్, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ తీసుకొని రావాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభమయ్యేదెప్పుడు..?

- పూర్తయిన టెండర్లు
- ఇబ్బందులు పడుతున్న వెల్లుట్లతండావాసులు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని వెల్లుట్లతండా బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్లు పూర్తయిన పనులు ప్రారంభం కావడంలేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీటీ రోడ్డుకు రూ. 1.25 కోట్ల నిధులు మంజూరు..

వెల్లుట్ల గ్రామ పంచాయతి పరిధిలోని వెల్లుట్లతండాకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు రూ. 1.25 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఇందుకు సంబంధించి టెండర్లు పూర్తయినప్పటికి ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. తండాకు వెళ్లే దారి మట్టి రోడ్డు ఉండగా, వర్షాలు కురిస్తే రోడ్డు అంతా బురదమయం అవుతుంది. దీంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షాకాలం ప్రారంభం కాక ముందే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని తండావాసులు కోరుతున్నారు.





వెల్లుట్లతండాకు వెళ్లే మట్టి రోడ్డు

పనులు ప్రారంభించాలి



వెల్లుట్లతండాకు సంబంధించిన బీటీ రోడ్డు పనులను అధికారులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలి. రోడ్డు నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరైన పనులు ప్రారంభం కావడం లేదు. పనులు త్వరగా జరిగితే ఇబ్బందులు ఉండవు.

– తులసీరాం, వెల్లుట్లతండా

బురదమయంగా రోడ్డు



తండాకు సంబంధించిన బీటీ రోడ్డు పనులు వర్షాలు ప్రారంభమయ్యేలోగా పనులు పూర్తి చేయాలి. వర్షాలు కురిస్తే మళ్లీ రోడ్డు బురదమయంగా మారి పనులు జరగకుండా ఇబ్బందులు ఏర్పడుతాయి.

– జైపాల్, వెల్లుట్లతండా

చర్యలు తీసుకుంటాం

వెల్లుట్లతండాకు సంబంధించిన బీటీ రోడ్డుకు రూ. 1.25 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులకు టెండర్లు సైతం పూర్తయ్యాయి. పనులు త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– గిరిధర్, డీఈ, పంచాయత్ రాజ్, ఎల్లారెడ్డి

పనులను త్వరగా పూర్తి చేయాలి

- మంజీరలో చెక్ డ్యాం పనుల పరిశీలన
- ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణ

సాక్షి ఎఫెక్ట్..

బాన్సువాడ : చెక్ డ్యాం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణ అన్నారు. ఈ నెల 10న నాలుగేళ్లుగా కొనసా..గుతూనే చెక్ డ్యాం కథనానికి అధికారులు స్పందించారు. క్వాలిటి కంట్రోల్, ఇరిగేషన్ అధికారులు గురువారం చెక్ డ్యాం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షకాలం రానుందని మంజీరలో మీటర్ ఎత్తు వరకు వాల్ నిర్మించాలని, చెక్ డ్యాం రెండు వైపులా మంజీర నదిలో ఉన్న ఇసుక మేటలు సమానం చేయాలని సూచించారు. నీటి ప్రవాహం ఒకే మాదిరిలో వెళ్లేలా చూడాలని సూచించారు. పనులు త్వరగా పూర్తి చేసి నీరు నిల్వ ఉండేలా చూడాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఆయన వెంట కామారెడ్డి సీఈ శ్రీనివాస్, బాన్సువాడ ఎస్ఈ రాజశేఖర్, నిజామాబాద్ ఈఈ భూమారెడ్డి, ఇరిగేషన్ డీఈలు జగదీష్, దత్తాత్రి, భూమన్న, ఏఈ గజానంద్ తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణ, ఇరిగేషన్ అధికారులు

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి



మద్నూర్‌లో తనిఖీ చేస్తున్న ఏవో రాజు



జనగామలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఈవో రాజేశ్

మద్నూర్(జుక్కల్): రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ అధికారి రాజు ఆదేశించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. వానాకాలం సీజన్ మొదలవడంతో రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు నకిలీ విత్తనాలు అంటగడితే దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు చర్యలు తీసుకుంటామని దుకాణదారులకు హెచ్చరించారు. విత్తన డీలర్లు తెచ్చుకున్న స్టాక్ ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. విత్తనాల స్టాక్ వివరాలు సదరు కంపెనీకి చెందిన పూర్తి వివరాలు దుకాణదారుల వద్ద ఉండాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు తప్పకుండా ఇవ్వాలన్నారు. రైతులు ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయరాదని సూచించారు. లైసెన్స్‌లు కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు తీసుకోవాలని పేర్కొన్నారు. విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు దుకాణదారులున్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

బీబీపేట: మండలంలోని జనగామ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏఈవో రాజేశ్ గురువారం పరిశీలించారు. 1800 బస్తాల తూకం చేసిన వడ్లను రైస్‌మిల్లుకు తరలించారు. వర్షాలు పడడంతో రైతులు ఇబ్బందులు కాకూడదనే ఉద్దేశంతో వడ్లను త్వరగా తూకం వేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

ప్రతి గ్రామం అభివృద్ధిలో ఆదర్శం కావాలి

భిక్కనూరు: ప్రతి గ్రామం అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ చందర్ అన్నారు. గురువారం మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో పలు ఎన్ఆర్ ఈజీఎస్ పనులకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి హామీ పనులు కల్పించాలని చెప్పారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. వర్షాలు కురుస్తున్నందున మురికి నీరు నిలవకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులుకి నిర్మాణం చేపట్టే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు.



పనులను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ చందర్

కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీవో రాధిక, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వామి, సొసైటీ డైరెక్టర్ బాగా రెడ్డి, గ్రామ సచివాలయ కార్యనిర్వాక అధికారి లక్ష్మీ, గ్రామస్తులు ఉన్నారు.

ధాన్యం తరలింపును నిర్లక్ష్యం చేయొద్దు

భిక్కనూరు/దోమకొండ : ధాన్యం తరలింపులో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంతో పాటు రామేశ్వర పల్లి గ్రామంలో, దోమకొండ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. అకాల వర్షాల వల్ల పూర్తిగా తడిసిపోతుందని తెలిపారు. వాటిని తక్షణమే కొనుగోలు చేయాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్ కొనుగోలు కేంద్రాల వద్ద పూర్తి వివరాలు సేకరించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో వరి ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని ఆయన ఆదేశించారు కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామ్మోహన్, ఆర్డీవో వీణ, తహసీల్దార్లు శివప్రసాద్, సంజయ్ రావు, సొసైటీ అధ్యక్షులు భూమయ్య, మాజీ జెడ్పీటీసీ తిర్మల్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, రైతులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విక్టర్

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం మండలంలోని కుప్రియాల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ధాన్యం తడువకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మూడు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహశీల్దార్ గంగాసాగర్, ఏపీఎం రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద డైమండ్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రాజు



బిచ్కుంద(జుక్కల్) : మండల డైమండ్ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ రాజును ఎన్నుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిన సమావేశంలో రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తాము ప్రజలు, యువ సంఘాలు కలిసి రావాలని కోరారు.

ఆర్మీకి ఉపాధ్యాయుల అభినందన



కామారెడ్డి టౌన్ : పహల్గాం ఉగ్రవాద చర్యలను ఖండిస్తూ ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయినందుకు తెలంగాణ ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు దేశ ఆర్మీ సైన్యానికి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు దేవునిపల్లి, గర్గుల్‌లోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు, జిల్లా కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్ ఉపాధ్యాయులు జాతీయ జెండాలతో విజయ సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి, రాష్ట్ర బాధ్యుడు రాంచంద్రం, జిల్లా బాధ్యులు లక్ష్మిపతి, రాజశేకర్, పవన్‌కుమార్, రమేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

గుర్తింపులేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించొద్దు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దని డీఈవో ఎస్.రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని అడ్మిషన్ల పేరిట ప్రచారం చేస్తున్న నారాయణ, వీఐపీ యూనివర్సల్, ప్రెసిడెన్షియల్, అరబిందో, శ్లోకా–2 బ్రాంచ్, చాంపియన్ స్కూల్‌లలో అడ్మిషన్‌ను తీసుకునే ముందు మండల విద్యాశాఖ అధికారి ఎల్లయ్యను సంప్రదించాలని తెలిపారు. అనుమతిలేని పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుని తల్లిదండ్రులు ఇబ్బందులు పడవద్దని, విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేయవద్దని తెలిపారు.

శిక్షణ శిబిరం తనిఖీ

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామ జెడ్పీహైస్కూల్‌లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, ఎస్జీటీ ఉపాధ్యాయులకు కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం బాన్సువాడ ఎంఈవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి శిక్షణ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. శిక్షణకు ప్రతి ఉపాధ్యాయుడు విధిగా హాజరు కావాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్లు అయ్యాల సంతోష్, సుధాకర్‌గౌడ్ ప్రవీణ్‌కుమార్, వాజిద్ అలీ, రవికుమార్, పండరి, రాజశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తాం

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- పెద్ద శక్కర్గాలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



పెద్ద శక్కర్గాలో ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మద్నూర్(జుక్కల్): పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండలంలోని పెద్ద శక్కర్గాలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన పత్రాలను ఆయా లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం గ్రామంలో ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక బురదజల్లే ప్రయత్నాలు చేస్తారని వారిని పట్టించుకోవద్దన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు సాయిలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పరమేశ్ పటేల్, సొసైటీ చైర్మన్ శీనుపటేల్, నాయకులు హన్మండ్లు స్వామి, రాంపటేల్, అముల్, గ్రామస్తులున్నారు.

పిట్లంలో..

పిట్లం(జుక్కల్): మండలకేంద్రంలోని పిట్లం ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, జీపీ కార్యదర్శి బల్‌రాం, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మండల కేంద్రంలోని పిట్లం ఎస్సీ కాలనీకి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు, మండలంలోని గుడి తండాకు చెందిన పలువురు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుడితండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నేనావత్ లక్ష్మణ్ ఇటీవల మరణించాడు. ఎమ్మెల్యే లక్ష్మణ్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు పరామర్శించి, అండగా ఉంటానని భరోసా నిచ్చారు.

శ్రీరామదూతం శిరసా నమామి



నర్వలో పూజలు చేస్తున్న భక్తులు



దేవునిపల్లిలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

- ఘనంగా హనుమాన్ జన్మదిన వేడుకలు
- సిందూర పూజలు చేసిన భక్తులు

నిజాంసాగర్/కామారెడ్డి రూరల్ : నిజాంసాగర్, మహమ్మద్ నగర్, కామారెడ్డి మండలాల్లోని అన్ని గ్రామాల్లో అంజనేయ స్వామి ఆలయాల్లో గురువారం హనుమాన్ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి భక్తులు తమలపాకులు, జిల్లేడు పూలు, ఫల పంచామృత సిందూర అభిషేక పూజలు చేశారు. హనుమాన్ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

యోగాతో మానసిక ప్రశాంతత

భిక్కనూరు: రుషుల సాధనతోనే యోగా ఉద్భవించిందని ఎస్ఎస్‌వై గురూజీ మురళీధర్‌రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని నగరేశ్వరాలంయంలో నిర్వహించిన ఫ్యామిలీ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగా ప్రాణయామం ధ్యానంతో మానసిక ప్రశాంతతో పొందవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేసినట్లయితే సంపూర్ణ ఆరోగ్య వంతులు అవుతారన్నారు. యోగా దినోత్సవాన్ని ప్రతి ఏటా జరుపుకోవడం మన దేశానికి గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా భిక్కనూరు ఎస్ఎస్‌వై ఆధ్వర్యంలో యోగా గురువు మురళీధర్ రాజును శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో యోగా సాధకులు రమేశ్, ధన్నారపు రాజలింగం పబ్బనాగరాజు, గంగెల్లి శివకుమార్, గంగెల్లి మధుసూదన్,శ్రీరామ్, సిద్ధారెడ్డి, పబ్బకిరణ్, మణి, ఉమరాణి, క్రిష్ణవేణి, లత, లక్ష్మి, సంగీత, మధుశ్రీ, మాధురి, జయమ్మ, ప్రవళిక,అరుణ, మాధవి,మల్లేషు,తదితరులు పాల్గొన్నారు.



గురూజీ మురళీధర్ రాజును సన్మానిస్తున్న యోగా సాధకులు

ఆధ్యాత్మికం

సరస్వతిమాత ఆలయం వద్ద పూజలు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామ బాసర సరస్వతి మాత ఆలయం వద్ద గురువారం భక్తులు యజ్ఞం, హోమం, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో అమ్మవారి పాదుకలకు పూజలు చేసి, భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సాతెల్లి శ్రీనివాస్, రౌతు రాజు, జ్ఞానేశ్వర్, రాములు, విఠల్, సాయిలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకామాత కల్యాణం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలకేంద్రం గోపాల్ పేటలోని శ్రీ రేణుకమాత ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం పూజారి సిద్దేశ్వర శర్మ ఆధ్వర్యంలో శ్రీ రేణుకమాత, జమదగ్ని మహారాజుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని నాగిరెడ్డిపేటకు చెందిన కంచనపల్లి సంతోష్ గౌడ్, మాధవి దంపతుల చేతుల మీదుగా అమ్మవారి కల్యాణాన్ని జరిపించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారిని దర్శించుకున్న జాగృతి రాష్ట్ర యూత్‌కన్వీనర్

శ్రీ రేణుకామాత కల్యాణ మహోత్సవానికి జాగృతి రాష్ట్ర యూత్ కన్వీనర్ సంపత్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సంపత్‌గౌడ్‌ను స్థానిక గౌడసంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడసంఘం మండలాధ్యక్షుడు యాదగౌడ్, ప్రధాన కార్యదర్శి వంశీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గురువారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు బోనాలను ఊరేగించారు. బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.